ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 7 ఏప్రిల్ 2025






ధ్వజారోహణ కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు, ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ధ్వజారోహణ కార్యక్రమంలో కలశం, కంకణాలు, తదితర పూజాసామగ్రి



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

జగదభిరాముడు.. శ్రీరాముడే

● వైభవంగా కోదండరాముడి ధ్వజారోహణ కార్యక్రమం


● భక్తులతో కిటకిటలాడిన రాములోరి కోవెల

● ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): "జగదభిరాముడు శ్రీరాముడే... రఘుకుల సోముడు ఆ రాముడే" ఒంటిమిట్ట కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. వేకువజామునే మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య వృషభలగ్నంలో పంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా కంకణబట్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో గరుడ పటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ గరుడ ధ్వజ పటాన్ని ఆలయంలో ఊరేగింపుగా తీసుకువచ్చి గరుడ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేశామన్నారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసి, రాగతాల నివేదన ద్వారా ఇంద్రాద్రి సకల దేవతలను, నవగ్రహాలను అష్టదిగ్బంధాలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయభాస్కర్‌రెడ్డి కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టీటీడీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన దశరథరాముడు

ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీరామచంద్రుడు శేషవాహనంపై దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఆదివారం రాత్రి గ్రామ పురవీధుల్లో రామయ్య ఊరేగారు. ఈ సందర్భంగా దారి పొడవునా మహిళల కోలాటాలు, భజనలు నిర్వహించారు. కేరళ వాయిద్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. దారిపొడవునా భక్తులు స్వామివారికి కాయకర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



శేషవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు





స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న కడప ఎస్పీ అశోక్‌కుమార్



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

తలంబ్రాల తయారీలో శ్రీవారి సేవకులు

ఈ నెల 11న జరిగే ఒంటిమిట్ట సీతారాముల కల్యాణోత్సవానికి తలంబ్రాల తయారీని టీటీడీ అధికారులు ఆదివారం ప్రారంభించారు. ముందుగా బియ్యం, ముత్యాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తయారు చేసిన వాటితో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 425 మంది శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. సుమారు లక్షకు పైగా తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.



తలంబ్రాలు ప్యాకింగ్ చేస్తున్న శ్రీవారి సేవకులు

జిల్లాను మతసామరస్యంగా చేద్దాం

● ప్రజలకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపు



రాయచోటిటౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల సమష్టి కృషితో రాబోయే రోజుల్లో జిల్లాను మత సామరస్య జిల్లాగా చేద్దామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలో జరగబోయే అన్ని మతాలకు సంబంధించిన కార్యక్రమాలు, ప్రార్థనలు, ఊరేగింపుల్లో పాల్గొంటున్న ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సహృద్భావ వాతావరణంలో ఒకరికొకరు సహకరిస్తూ, ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవిస్తూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. అలాగే శాంతి భద్రతలు కాపాడడమే కాకుండా మత సామరస్యాన్ని పెంపొందించేందుకు జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటన రద్దు

రాయచోటి కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరగాల్సిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటన రద్దు అయినట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ పర్యటన రద్దయిందని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 7న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలోనూ ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మార్ఫింగ్ ఫొటోలతో యువతికి బ్లాక్‌మెయిల్

● పోలీసుల అదుపులో డాక్టర్

7

గంజాయి 'పుష్ప'లు

● ముందు కూలీలు.. ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు

7

● రెండు రోజుల కిందట అరెస్టు



వేడుకగా సీతారాముల కల్యాణం

● పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి మండిపల్లి దంపతులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురష్కరించుకొని రాయచోటి పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణ ఉత్సవానికి హాజరైన మంత్రి దంపతులకు అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు

శేషవాహనంపై పట్టాభిరాముడి వైభవం

● కనుల పండువగా ఊంజల్‌సేవ


వాల్మీకిపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులను సర్వభూపాల వాహనంపై విశేష అలంకరణలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో యాగశాల, వైధిక కార్యక్రమాల అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్నపన తిరుమంజనం వేడుకగా సాగింది. సాయంత్రం ఆలయ మండపంలో భక్తుల నడుమ రాముడి ఊంజల్‌సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం రాత్రికి పెద్దశేష వాహనంపై విశేషాలంకృతుడైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడిని పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించగా భక్తులు దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల చలిపిండి దీపారాధనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగా సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, ఊంజల్‌సేవ, రాత్రికి మోహిని అవతారుడైన పట్టాభిరాముడి నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని టీటీడీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్‌భట్టర్, కృష్ణరాజు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కనుల పండువగా రాముడి ఊంజల్‌సేవ

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

పట్టణంలోని పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామలక్ష్మణులకు ప్రత్యేక అలంకరణలు గావించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



పెద్దశేషవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీనటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

క్యూలైన్లో స్పృహ తప్పిన చిన్నారి



ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామస్వామి దర్శనానికి వచ్చిన చిన్నారులు ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. దీంతోపాటు ఎండ తీవ్రత కూడా ఎక్కువ కావడంతో చిన్నారులు కొంతమంది ఇబ్బందులు పడ్డారు. ఒక చిన్నారి స్పృహ కోల్పోయి కిందపడిపోయింది. దీంతో సెక్యూరిటీ సిబ్బంది ఆ చిన్నారిని పక్కకు తీసుకువచ్చారు. కొంతసేపటికి ఆ చిన్నారి స్పృహలోకి వచ్చింది. అనంతరం ఆ చిన్నారికి దర్శనం కల్పించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రాములోరి సన్నిధిలో ఆకేపాటి, మేడా వర్గీయుల వాగ్వాదం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని రాములవారి కోవెలలో ఆకేపాటి, మేడా వర్గీయులు వాగ్వాదానికి దిగారు. కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి వచ్చారు. పూజ ముగిసిన తర్వాత విజయశేఖర్‌రెడ్డికి ఆకేపాటి వర్గీయులు అడ్డురావడంతో వాగ్వాదం మొదలైంది. అంతవరకు రామనామస్మరణతో మార్మోగిన ఆలయంలో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయంలో ఇలాంటివి జరగడం సరికాదని పలువురు భక్తులు హితవు పలికారు.

జాతీయ స్థాయిలో విజేతలు కావడం ప్రశంసనీయం : డీఈవో

నందలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నందలూరు విద్యార్థులు జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవడం ప్రశంసనీయమని డీఈవో సుబ్రమణ్యం తెలిపారు. ఫిబ్రవరిలో బెంగుళూరులో జరిగిన నేషనల్ స్టూడెంట్స్ ఇన్నోవేషన్ చాలెంజ్-2025 పోటీలలో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు లక్ష్మీచైతన్య, షేక్ జైనాబ్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా స్కూలు చైర్మన్ త్రినాధ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం డీఈవోను కలిశారు. ఎన్ఎస్ఐసీ ప్రత్యేకత, షీ రూమ్ను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనాథ్, మెంటర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశంసిస్తున్న డీఈవో సుబ్రమణ్యం

కిడ్నాప్, చోరీ కేసులో ఇరువురి అరెస్టు

● సెల్‌ఫోన్ స్వాధీనం

కడప క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు మార్చి 15న హైదరాబాదు నుండి కారును బాడుగకు తీసుకువచ్చి ఆపై డ్రైవరుపై దాడి చేసి బంగారు దోచుకెళ్లిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. సీఐ ఓబులేసు తెలిపిన వివరాల మేరకు.. కడపకు చెందిన సాదక్‌వల్లి, తాజుద్దీన్ గతనెల 15న హైదరాబాదులో ఇన్నోవా కారును బాడుగకు మాట్లాడుకుని 16న తెల్లవారుజామున కడపకు వచ్చారు. ఇక్కడున్న మరో ముగ్గురిని పిలిపించి కారు డ్రైవరును నిర్బంధించి అతని వద్ద ఉన్న బంగారు గొలుసు, సెల్‌ఫోన్‌తో పాటు కారును చోరీ చేశారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన సాదక్‌వలి, తాజుద్దీన్‌లను దేవునికడప రోడ్డులో అరెస్టు చేసి వారి నుండి ఒక సెల్‌పోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్ఫింగ్ ఫోటోలతో యువతికి బ్లాక్‌మెయిల్

● పోలీసుల అదుపులో డాక్టర్..?

కడప క్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైద్యుడు అంటే దేవుడితో సమానం. అలాంటి వైద్య వృత్తిలో ఉన్న ఓ వ్యక్తి కీచక బుద్ధితో వ్యవహరించాడు. కడపకు చెందిన ఓ యువతి ఫోటోలను డౌన్‌లోడ్ చేసుకుని మార్ఫింగ్ చేసి యువతి సెల్‌ఫోనుకు పంపించాడు. ఫోను చేసి శారీరకంగా కలవాలంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతుండడంతో ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. వేములకు చెందిన ఆ డాక్టరుకు పులివెందులలో ఆసుపత్రి ఉంది. కడప హోమియో ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. ఇతడిని శనివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సెల్‌ఫోనులో చిత్రీకరించిన ఫోటోలు, ఇతర వీడియోలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మార్ఫింగ్ ఫోటోలను ఎవరికైనా పోస్టింగ్ చేశాడా లేక మెయిల్ పంపాడా అన్న విషయంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నేడో రేపో డాక్టరు అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గంజాయి 'పుష్ప'లు

ముందు కూలీగా పనికి వెళ్తాడు. తర్వాత అడవిలో ఎర్రచందనం చెట్లను నరికే మాఫియాకు డాన్‌గా ఎదుగుతాడు.. ఇది పుష్ప సినిమాలో హీరో కథ. ముందు కొనుగోలుదారుల్లా వెళ్తారు. తర్వాత సరఫరాదారులుగా మారతారు. ఆ తర్వాత సరఫరాదారులకు లీడర్లు అయిపోతారు.. ఇది రియల్ లైఫ్‌లో గంజాయి స్మగ్లర్ల కథలు. ఒడిసా సరిహద్దుల నుంచి జరుగుతున్న ఈ గంజాయి సరఫరాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా, వివిధ కేసులను విశ్లేషించిన పోలీసులకు 'పుష్ప' కథలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి.

● ముందు కూలీలు.. ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు
● గంజాయి సరఫరాలో అంతకంతకూ ఎదుగుతున్న స్మగ్లర్లు
● ఒడిసా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సరఫరా
● స్మగ్లర్లుగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా యువకులు
● రెండు రోజుల కిందట అరెస్టు
● విచారణలో వినిపిస్తున్న పుష్ప సినిమా పోలిన కథలు




రెండు రోజుల కిందట విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన చిత్తూరు జిల్లా గంజాయి స్మగ్లర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): షేక్ షాజిద్... అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామం అతడి సొంతూరు. షేక్ ఫయాజ్... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కొత్తపేట సొంతూరు. ఈ ఇద్దరికీ మధ్యప్రదేశ్‌లోని నాసిక్‌కు చెందిన సంజయ్‌తో సంబంధాలు కలిశాయి. ఇందుకు గంజాయే కారణమైంది. షాజిద్, ఫయాజ్‌ను పటమట పోలీసులు రెండు రోజుల కిందట ఎనికేపాడులో అరెస్టు చేశారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. షాజిద్‌పై జిల్లాలో గంజాయి కేసులు ఉన్నాయి. వేర్వేరు గ్యాంగ్‌ల కింద ఇతను కూలీగా పనిచేశాడు. అన్నమయ్య జిల్లా నుంచి బయల్దేరి ఉత్తరాంధ్ర వరకు వెళ్లేవాడు. అక్కడ సరుకును కొనుగోలు చేసి పోలీసులకు చిక్కకుండా గమ్యస్థానాలకు చేర్చేవాడు. ఇలా గంజాయిని మరికొంతమందితో కలిసి తీసుకెళ్తుండగా, 2017లో చిల్లకల్లు పోలీసులకు చిక్కాడు. షాజిద్‌తో పాటు మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి అప్పట్లో 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొద్దికాలంపాటు స్తబ్దుగా ఉన్న షాజిద్ మళ్లీ గంజాయి సరఫరాలోకి దిగాడు. సంజయ్.. నాసిక్‌లో గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉండగా, రెండు, మూడుసార్లు గంజాయిని ఉత్తరాంధ్ర నుంచి నాసిక్‌కు షాజిదే పంపించాడు.

'సిల్క్' గంజాయి

షాజిద్ కుటుంబం అన్నమయ్య జిల్లాలో పట్టు పురుగులు సాగు చేస్తోంది. వారు చేనేతలకు సిల్క్‌ను కూడా సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రామసముద్రంలో ఉన్న స్నేహితుల ద్వారా నాసిక్‌లో కొంతమందితో పరిచయం పెంచుకున్న షాజిద్.. 2017 నుంచి ఆ బంధాలు కొనసాగిస్తున్నాడు. అప్పట్లో చిల్లకల్లు పోలీసులకు చిక్కిన షాజిద్.. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తులతో గంజాయి సంబంధాలు కొనసాగించినప్పటికీ పోలీసులకు మాత్రం చిక్కలేదు. ముందుగా నాసిక్‌లో వివిధ గ్యాంగ్‌ల్లో కూలీగా ఒడిసా, ఉత్తరాంధ్ర సరిహద్దులకు వచ్చాడు. తర్వాత తానే స్మగ్లింగ్‌కు కింగ్‌గా మారాడు. కూలీగా వెళ్లిన దానికంటే ప్రధాన స్మగ్లర్‌గా ఉంటేనే డబ్బు బాగా గిట్టుబాటు అవుతోందని భావించాడు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారును గంజాయి స్మగ్లింగ్ కోసం కొన్నాడు. ఎంపీ 06 బీఏ 0710 నెంబరు కలిగిన ఈ కారును చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచే గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గంజాయి కావాలని నాసిక్ నుంచి ఎవరైనా ఫోన్ చేస్తే బేరం మాట్లాడుకుంటాడు. అక్కడి నుంచి వచ్చిన మరొకరిని కార్లో తీసుకుని సరుకు కోసం మన్యానికి తీసుకెళ్తాడు. ఆ విధంగా చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఫయాజ్‌ను తీసుకుని వస్తుండగా నగరంలోని ఎనికేపాడులో పటమట పోలీసులకు దొరికిపోయాడు. ఫయాజ్ స్వయంగా డ్రైవర్ కావడంతో కారును నడపడానికి అతడిని వెంటబెట్టుకుని వచ్చాడు. నర్సీపట్నంలో రూ.2.50 లక్షలకు 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నాసిక్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం రావడంతో పటమట పోలీసులు ఈ తరలింపును తొలిలోనే అడ్డుకున్నారు.



వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

సీకేదిన్నె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆజాద్‌నగర్ సమీపంలో జింక మృతి చెందింది. కడప-రాయచోటి పులివెందుల బైపాస్‌లో రోడ్డు దాటుతున్న జింకను ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చెర్లోపల్లె రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు సమాచారం అందించడంతో చింతకొమ్మదిన్నె పోలీసులు, ఫారెస్టు సిబ్బంది మృతి చెందిన జింకను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు విచారిస్తున్నట్లు తెలిపారు.

వాటర్‌గండిలో బాలుడి గల్లంతు

కడపక్రైం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని వాటర్‌గండిలో ఆదివారం ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఆ వివరాల్లోకి వెళితే.. కడప నగరం నకాశ్‌కు చెందిన సయ్యద్ సమీర్ (17) ఈత కోసం వాటర్‌గండిలో దిగాడు. ఈ క్రమంలో ఈత ఆడుతూ నీళ్లలో కొట్టుకుపోయాడని బంధువులు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం సామగ్రిని తరలించొద్దు

● ఏసీఏ నుంచి నిధులు మంజూరు చేసినా పూర్తి చేయని వైసీపీ
● ఇన్‌చార్జితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేస్తాం
● టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి



సామగ్రిని తరలింపును పరిశీలిస్తున్న వెంకట్రామిరెడ్డి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నుంచి సామగ్రిని తరలించవద్దని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్టేడియం వద్దకు వెళ్లి సామగ్రిని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏసీఏ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అయితే కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం, ఏసీఏ సంఘం మారడంతో స్టేడియం నిర్మాణ పనులు మరుగునపడ్డాయి. దీంతో ఇక్కడ ఉన్న సామగ్రిని తరలిస్తున్న విషయం తెలిసిన వెంటనే వెంకట్రామిరెడ్డి వాహనాన్ని అడ్డుకున్నారు. సమస్యను టీడీపీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి, అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి సామగ్రిని తరలించవద్దని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవలం కమీషన్ కోసమే పనులు ప్రారంభించింది తప్ప పూర్తి చేయలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులలో స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం మంచిదే కానీ, 90 శాతం నిధులు మంజూరైనా పనులు మాత్రం 60శాతం అయ్యాయన్నారు. వీటిని తరలించవద్దని, క్రికెట్ స్టేడియం పూర్తి చేసి పులివెందులకు తలమానికంగా నిలబెడతామన్నారు. సమస్యను బీటెక్ రవితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

● అంతా రామమయం.. జగమంతా రామమయం ● రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వైభవంగా కల్యాణోత్సవం


సంబేపల్లె: సీతారాముల కల్యాణానికి హాజరైన మంత్రి సతీమణి హరిత


గాలివీడులో సీతారాముల కల్యాణ మహోత్సవం


నందలూరు: మంగళ సూత్రాన్ని చూపుతున్న పురోహితులు


రాజంపేట: సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు రైల్వేకోడూరు మండలంలో ఆదివారం వైభవంగా జరిగాయి. ప్రతి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక పూజలు చేశారు. మండలంలోని బయనపల్లె, ఓబనపల్లె గ్రామాల్లో శ్రీరామచంద్రమూర్తి, సీతాదేవిల కల్యాణ వైభవోపేతంగా నిర్వహించారు. బయనపల్లె గ్రామంలో 92వ దేవుని కల్యాణం జరగడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై పూజలు చేశారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని రాఘవరాజపురం కోదండరామాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అలాగే రైల్వేకోడూరు మండల వ్యాప్తంగా కోదండరామాలయాల్లో స్వామివారికి పానకాలు, పెసలపప్పు, బెల్లం వంటి పదార్థాలను ప్రసాదం పెట్టి భక్తులకు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

రామాపురం, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లె, హసనాపురం, చిట్లూరు గ్రామ సరిహద్దులోని సోమరాయునిపేట ఆలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు బాలిశెట్టి చంద్రమౌళి, గాలివీటి సురేంద్రారెడ్డి, చెన్నక్రిష్టారెడ్డి, రెడ్డికుమార్, రామచంద్ర, సహదేవరెడ్డి, రామకృష్ణగౌడ్, అంజనారెడ్డి, ధర్మారెడ్డి, పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, నందలూరి కరుణాకర్‌రెడ్డి, ఊరగాయల బయారెడ్డి పాల్గొన్నారు.


రామాపురం: సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

వైభవంగా సీతారాముల కల్యాణం

పెనగలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అతిగారిపల్లెలో నలమారు చంద్రశేఖర్‌రెడ్డి ఆయన సతీమణులు సరస్వతి, శ్రీగుణవాణి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాలను పచ్చతోరణాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

కల్యాణం... కమనీయం

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లెటౌన్, చింతకుంటవాండ్లపల్లె, కోనంపేట, దిన్నెపాడు, మద్దిరేవుల తదితర గ్రామాల్లో కల్యాణం నిర్వహించారు.

కల్యాణంలో గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): రామనామం పరమ పావనమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఆయన రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం అన్నమరాజుగారిపల్లె రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రీరాముడి కరుణా కటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

ఓబులవారిపల్లెలో...

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. మంగంపేట, ఓబులవారిపల్లె, చెన్నరాజుపోడు, గాదెల, బొమ్మవరం, చిన్నంపల్లె, గద్దలరేవుపల్లె తదితర గ్రామాల్లో శ్రీరాముని ఊరేగింపు జరిగింది.

సిద్దవటంలో సీతారాముల కల్యాణం

సిద్దవటం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాలకు చెందిన కోదండరామ స్వామి ఆలయాల్లో సీతారాముల మూల విరాట్ విగ్రహాలకు ఆదివారం కల్యాణం వైభవోపేతంగా జరిగింది. రాజంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు.

సంబేపల్లెలో...

సంబేపల్లె, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణం కనులారా చూస్తే ఎంతో భాగ్యం అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ తెలిపారు. సంబేపల్లె మండల కేంద్రంలోని రామాలయంలో ఆదివారం కుమారుడు నిశ్చల్‌నాగిరెడ్డితో కలిసి సీతారాముల కల్యాణం మహోత్సవంలో పాల్గొన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

గాలివీడులో...

మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో వేద పండితులు నాగఫణికిశోర్‌శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

నందలూరులో...

మండలంలోని ఇసుకపల్లెలో వెలసిన భద్రాద్రి రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పురోహితులు బండాత్మకూరు శివకుమార్‌శర్మ సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అలాగే ఎగువకుమ్మరపల్లెలోని రామాలయంలో జనసేన రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

రామ రామ రఘు రామ...

వీరబల్లి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల రామాయాల్లో శనివారం ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక వేదపండితులచే అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వంగి మళ్ల, పెద్దివీడు, వీరబల్లి రామాలయంలో సీతా రాముల కల్యాణ వేడుకలు కను విందుగా జరిగాయి.

రాజంపేటలో...

రాజంపేట టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందరూ శ్రీరాముని ఆదర్శంగా తీసుకుని ధర్మంగా జీవనం గడపాలని కోరారు.


సిద్దవటం: స్వామి అమ్మవార్ల కల్యాణం జరుపుతున్న పండితులు


రైల్వేకోడూరు: బయనపల్లెలో సీతారామ కల్యాణంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్


పుల్లంపేట: కల్యాణమూర్తులైన సీతారాములు


పెనగలూరు: సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

రాయచోటిటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని, ప్రజలు సమర్పించే అర్జీల్లో ఎక్కువ శాతం భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిచడం జరిగింది.

ప్రవాసాంధ్రుల అభిమానం వెలకట్టలేనిది


సుగవాసిని సన్మానిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రవాసాంధ్రుల అభిమానం వెలకట్టలేనిదని టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. ఉగాది వేడుకలను కువైత్ నగరంలో జరుపుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. గల్ఫ్‌రాయల్, ఎన్‌ఆర్‌ఐ అసోసియేషన్, కాపు బలిజ సంఘం నాయకుల ఆహ్వానం మేరకు అబ్బాసియాలోని అస్పైర్ బిలింగోల్ స్కూల్లో ఉగాది సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలు సుండుపల్లె మండలం కందలవాండ్లపల్లెకు చెందిన సుగవాసి యువసేన కంచనరెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నాయకులు, బలిజ సంఘం సోదరులు సోదరీమణులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చెల్లు వంశీయులు గంగన్న, సురేంద్ర కుటుంబ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


పుల్లంపేటలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు


రాజంపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు


సుండుపల్లె: జెండాను ఎగురవేస్తున్న అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్

రాజంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో బీజేపీ నాయకులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు బీజేపీ జెండాను ఎగురవేసి గౌరవవందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా గుర్తింపు పొందుతుందన్నారు. నేడు ప్రపంచం అగ్రదేశాల సరసన నిలుస్తుందని దీనికి కారణం కేవలం బీజేపీ పార్టీ అధికారంలో ఉండడమేనన్నారు.

'దేశ అభివృద్ధిలో బీజేపీది చెరగని ముద్ర'

సుండుపల్లె, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధిలో బీజేపీది చెరగని ముద్ర అని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. ఆదివారం సుండుపల్లె మండల కేంద్రంలోని బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో దేశ అభివృద్ధికి నిరంతర కృషి జరుగుతోందన్నారు. మండల మాజీ అధ్యక్షుడు రాజ్యరాయుడు, పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరు: బీజేపీ మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డిక్రిష్ణరాయల్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ముఖ్యఅతిథిగా, మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు.

ఓబులవారిపల్లె: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు ఆధ్వర్యంలో పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. తన సొంత గ్రామమైన బొమ్మవరం, మంగంపేట, కొర్లకుంట తదితర ప్రాంతాల్లో పలువురు కార్యకర్తలతో కలిసి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు చెంగల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల నాయకులు చిన్నరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కత్తిరించి అభిమానులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

పుల్లంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు ఆదివారం పుల్లంపేటలో జెండా ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. చిట్టచివరి పల్లె వరకు పార్టీని తీసుకెళ్లి జెండాను ఎగురవేసి అభివృద్ధి చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలన్నారు. ప్రతి సామాన్యుడికి ఉపయోగపడేలా భారతదేశాన్ని ముందుకు తీసుకెళుతున్న బీజేపీ మోడీ నాయకత్వాన్ని బలపరచాలన్నారు. కంబాల శ్రీనివాసులు, సాదు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో నాయకులు

నందలూరు: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర గిరిజన మోర్చ నాయకుడు పోతురాజు మస్తానయ్య, రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోపినేని హిమగిరినాథ్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని అరవపల్లె, ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఆదివారం పార్టీ పతాకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. హిమగిరినాథ్ మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలన్నారు. ఎన్డీయే పక్ష నాయకులు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, మండల ప్రధాన కార్యదర్శి గంగయ్య, క్రియాశీలక సభ్యులు గోపినాథ్, అనిల్, కుమార్, హేమంత్, గోపాల్, వెంకటేశ్, నారాయణ, సూరి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు చేస్తున్న కాపు నాయకులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధురాలు ఆదివారం ఇంద్ర బస్‌షెల్టర్ వద్ద మృతి చెందింది. సమాచారం అందుకున్న కాపు నాయకులు మండల నాగేంద్ర, సీహెచ్ రమేష్ బాబులు ఆ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు, పంచాయతీ అధికారులకు సమాచారం అందించి అంత్యక్రియలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

కార్మిక సంఘం సభ్యుడిగా చెన్నయ్య



రైల్వేకోడూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం సభ్యుడిగా సిగి చెన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గత శుక్రవారం కాకినాడలో జరిగిన రాష్ట్ర కార్యకర్తల సమావేశంలో తనను ఎన్నుకున్నారన్నారు. అన్నమయ్య జిల్లాలో అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. తన పై ఎంతో నమ్మకంతో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకత్వం బాధ్యతను అప్పగించిందన్నారు.

ఫార్మసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా యూనస్



సుండుపల్లె, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): ఫార్మసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా సుండుపల్లె మండలానికి చెందిన షేక్. యూనస్‌ను రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, చైర్మన్, సురేశ్‌బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్ కమిటీ సభ్యులు సంతోశ్, కృష్ణవేణి, నాగజ్యోతి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు వీధిలైట్లు మరమ్మతులకు గురికావడంతో ఆదివారం వాటిని సరిచేశారు. సర్పంచ్ మేకల సుఖవేణి, బాబురెడ్డి చొరవతో దీధి దీపాల మరమ్మతులు జరిగాయి.

రాజంపేటలో ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీ


ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

రాజంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భగా ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో రాజంపేట పురవీధుల్లో ఈ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, విశ్వ హిందు పరిషత్ నాయకులు మణి పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

నందలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : జనసేనపార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తిరుమలలో రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ కలిసి సమస్యలను వివరించినట్లు జనసేన ఉమ్మడి కడప జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబరు గురివిగారి వాసు పేర్కొన్నారు.

23 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 23 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు నియోజకవర్గంలోని యర్రావారిపాలెం, కేవీపల్లి, కలికిరి, కలకడ, గుర్రకొండ, కదిరి, పెద్దమండెం, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చారు. లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైపీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి పాల్గొన్నారు.

ఎస్‌ఐని సత్కరించిన సుగవాసి వర్గీయులు

సిద్దవటం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన షరీఫ్‌ను రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం వర్గీయులు ఆదివారం సత్కరించారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, టీడీపీ సీనియర్ నేత చెంచయ్యనాయుడు, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, నియోజకవర్గ యువ నాయకులు రాజానాయుడు, కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి మాజీ సలహా కమిటీ సభ్యుడు మల్లు వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో ఘనంగా పోతన జయంతి


పోతన చిత్రపటానికి పూలమాల వేస్తున్న కవులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో ఆదివారం పోతన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదురుగా ఉన్న పోతన విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కవి సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం భక్తులను అలరించింది. భాగవత ప్రాసస్త్యం గురించి పసుపులేటి శంకర్, ముమ్మడి నారాయణరెడ్డి, రుక్మిణి సందేశం గురించి చంద్రశేఖర్‌రెడ్డి, గజేంద్ర మోక్షం గురించి గోపాలకృష్ణ, ప్రహ్లాద చరిత్ర గురించి శివారెడ్డి, వామన చరిత్ర గురించి నీలవేణిలు వివరించారు.

క్యూలైన్లో స్పృహ తప్పిన చిన్నారి



ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామస్వామి దర్శనానికి వచ్చిన చిన్నారులు ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. దీంతోపాటు ఎండ తీవ్రత కూడా ఎక్కువ కావడంతో చిన్నారులు కొంతమంది ఇబ్బందులు పడ్డారు. ఒక చిన్నారి స్పృహ కోల్పోయి కిందపడిపోయింది. దీంతో సెక్యూరిటీ సిబ్బంది ఆ చిన్నారిని పక్కకు తీసుకువచ్చారు. కొంతసేపటికి ఆ చిన్నారి స్పృహలోకి వచ్చింది. అనంతరం ఆ చిన్నారికి దర్శనం కల్పించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రాములోరి సన్నిధిలో ఆకేపాటి, మేడా వర్గీయుల వాగ్వాదం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని రాములవారి కోవెలలో ఆకేపాటి, మేడా వర్గీయులు వాగ్వాదానికి దిగారు. కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి వచ్చారు. పూజ ముగిసిన తర్వాత విజయశేఖర్‌రెడ్డికి ఆకేపాటి వర్గీయులు అడ్డురావడంతో వాగ్వాదం మొదలైంది. అంతవరకు రామనామస్మరణతో మార్మోగిన ఆలయంలో కొంతసేపు గందరగోళం ఏర్పడింది. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయంలో ఇలాంటివి జరగడం సరికాదని పలువురు భక్తులు హితవు పలికారు.

జాతీయ స్థాయిలో విజేతలు కావడం ప్రశంసనీయం : డీఈవో

నందలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నందలూరు విద్యార్థులు జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవడం ప్రశంసనీయమని డీఈవో సుబ్రమణ్యం తెలిపారు. ఫిబ్రవరిలో బెంగుళూరులో జరిగిన నేషనల్ స్టూడెంట్స్ ఇన్నోవేషన్ చాలెంజ్-2025 పోటీలలో గొబ్బిళ్ల అక్షర స్కూల్ విద్యార్థులు లక్ష్మీచైతన్య, షేక్ జైనాబ్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా స్కూలు చైర్మన్ త్రినాధ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం డీఈవోను కలిశారు. ఎన్ఎస్ఐసీ ప్రత్యేకత, షీ రూమ్స్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనాథ్, మెంటర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశంసిస్తున్న డీఈవో సుబ్రమణ్యం



దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీనటి కొణిదెల నిహారిక

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

పండగ పూట విషాదం

- వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య
- బి.కొత్తకోటలో ఒకరు.. మదనపల్లెలో ఒకరు



మృతి చెందిన ఉదయ్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

పండుగ పూట ఆ కుటుంబాలలో విషాదం చోటుచేసుకుంది. అంతవరకు కుటుంబసభ్యులతో కలిసి ఉన్నవారు క్షణంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి తీరని దుఃఖాన్ని మిగిల్చారు. వేర్వేరు ప్రాంతాల్లో ఇరువురు ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నారు.

బి.కొత్తకోట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోటలోని పోకనాటివీధిలో నివాసం వుంటూ ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే మారెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి(35) శనివారం రాత్రి తన నివాసంలోనే ఉరి వేసుకొన్నాడు. కుటుంబీకులు గమనించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలియడంతో సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ వైఎస్ జగన్ కాలనీలో కాపురం ఉంటున్న మహమ్మద్ అలీ భార్య సుమియా(28) ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుంది, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

అరటి తోట దగ్ధం - రూ.5 లక్షలు నష్టం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన గోటూరు సుబ్రహ్మణ్యంరెడ్డికి చెందిన అరటితోట శనివారం సాయంత్రం దగ్ధమైంది. ఆ రైతు తెలిపిన వివరాల మేరకు.. అరటితోట పైభాగంలో ఉన్న విద్యుత్ లైన్లు ట్రిప్ కావడంతో మంటలు చెలరేగడంతో కాపుకొచ్చిన ఒకటిన్నర ఎకరాలోని అరటితోట పూర్తిగా కాలిపోయిందని వాపోయాడు. అంతేకాకుండా డ్రిప్ వైర్లు, తదితర వ్యవసాయ సామగ్రి కూడా కాలిపోయిందని, సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అప్పులు చేసి అరటి తోటను సాగు చేశామని, పంట చేతికికొచ్చే సమయంలో పూర్తిగా పాడైపోవడంతో అప్పుల్లో కూరుకుపోయానని బావురమన్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు సుబ్రహ్మణ్యంరెడ్డి కోరుతున్నాడు.

చోరీకి యత్నించిన దొంగకు దేహశుద్ధి



గాలివీడు, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): ఓ షాపు వద్ద ఉన్న ఫ్రిడ్జ్‌ను దొంగిలించే ప్రయత్నం చేయబోయిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బీహార్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున ఉదయం 5 గంటల ప్రాంతంలో గేటు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఓ దుకాణం వద్ద ఉన్న ఫ్రిడ్జ్‌ను తరలించే ప్రయత్నం చేస్తుండగా చుట్టుప్రక్కల దుకాణాదారులు చూసి అతనికి దేహశుద్ధి చేసి తాడుతో బంధించి పోలీసులకు అప్పగించారు. బీహార్, రాజస్థాన్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుండి ఉపాధి కోసం వచ్చామంటూ సంచరించే కొత్త వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యకి మృతి

పెద్దమండ్యం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బెంగుళూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణం నానాదర్గా వీధికి చెందిన షేక్ బాబా (48) స్వంత పనుల నిమిత్తం అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు వచ్చి శనివారం ఆటోలో తిరుగు ప్రయాణం చేస్తుండగా మండలంలోని కలిచెర్ల సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షేక్ బాబాను చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగుళూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి 'పుష్ప'లు

ముందు కూలీగా పనికి వెళ్తాడు. తర్వాత అడవిలో ఎర్రచందనం చెట్లను నరికే మాఫియాకు డాన్‌గా ఎదుగుతాడు.. ఇది పుష్ప సినిమాలో హీరో కథ. ముందు కొనుగోలుదారుల్లా వెళ్తారు. తర్వాత సరఫరాదారులుగా మారతారు. ఆ తర్వాత సరఫరాదారులకు లీడర్లు అయిపోతారు.. ఇది రియల్ లైఫ్‌లో గంజాయి స్మగ్లర్ల కథలు. ఒడిసా సరిహద్దుల నుంచి జరుగుతున్న ఈ గంజాయి సరఫరాలో లక్షలాది రూపాయలు చేతులు మారుతుండగా, వివిధ కేసులను విశ్లేషించిన పోలీసులకు 'పుష్ప' కథలు కోకొల్లలుగా వినిపిస్తున్నాయి.

- ముందు కూలీలు.. ఆ తర్వాత స్మగ్లింగ్ లీడర్లు
- గంజాయి సరఫరాలో అంతకంతకూ ఎదుగుతున్న స్మగ్లర్లు
- ఒడిసా నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సరఫరా
- స్మగ్లర్లుగా వ్యవహరిస్తున్న చిత్తూరు జిల్లా యువకులు
- రెండు రోజుల కిందట అరెస్టు
- విచారణలో వినిపిస్తున్న పుష్ప సినిమా పోలిన కథలు



రెండు రోజుల కిందట విజయవాడ పోలీసులు అరెస్టు చేసిన చిత్తూరు జిల్లా గంజాయి స్మగ్లర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): షేక్ షాజిద్... అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మినికి గ్రామం అతడి సొంతూరు. షేక్ ఫయాజ్... చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కొత్తపేట సొంతూరు. ఈ ఇద్దరికీ మధ్యప్రదేశ్‌లోని నాసిక్‌కు చెందిన సంజయ్‌తో సంబంధాలు కలిశాయి. ఇందుకు గంజాయే కారణమైంది. షాజిద్, ఫయాజ్‌ను పటమట పోలీసులు రెండు రోజుల కిందట ఎనికేపాడులో అరెస్టు చేశారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. షాజిద్‌పై జిల్లాలో గంజాయి కేసులు ఉన్నాయి. వేర్వేరు గ్యాంగ్‌ల కింద ఇతను కూలీగా పనిచేశాడు. అన్నమయ్య జిల్లా నుంచి బయల్దేరి ఉత్తరాంధ్ర వరకు వెళ్లేవాడు. అక్కడ సరుకును కొనుగోలు చేసి పోలీసులకు చిక్కకుండా గమ్యస్థానాలకు చేర్చేవాడు. ఇలా గంజాయిని మరికొంతమందితో కలిసి తీసుకెళ్తుండగా, 2017లో చిల్లకల్లు పోలీసులకు చిక్కాడు. షాజిద్‌తో పాటు మిగిలిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి అప్పట్లో 520 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత కొద్దికాలంపాటు స్తబ్దుగా ఉన్న షాజిద్ మళ్లీ గంజాయి సరఫరాలోకి దిగాడు. సంజయ్.. నాసిక్‌లో గంజాయి వ్యాపారానికి కింగ్‌పిన్‌గా ఉండగా, రెండు, మూడుసార్లు గంజాయిని ఉత్తరాంధ్ర నుంచి నాసిక్‌కు షాజిదే పంపించాడు.

'సిల్క్' గంజాయి

షాజిద్ కుటుంబం అన్నమయ్య జిల్లాలో పట్టుపురుగులు సాగు చేస్తోంది. వారు చేనేతలకు సిల్క్‌ను కూడా సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రామసముద్రంలో ఉన్న స్నేహితుల ద్వారా నాసిక్‌లో కొంతమందితో పరిచయం పెంచుకున్న షాజిద్.. 2017 నుంచి ఆ బంధాలు కొనసాగిస్తున్నాడు. అప్పట్లో చిల్లకల్లు పోలీసులకు చిక్కిన షాజిద్.. ఆ తర్వాత వేర్వేరు వ్యక్తులతో గంజాయి సంబంధాలు కొనసాగించినప్పటికీ పోలీసులకు మాత్రం చిక్కలేదు. ముందుగా నాసిక్‌లో వివిధ గ్యాంగ్‌ల్లో కూలీగా ఒడిసా, ఉత్తరాంధ్ర సరిహద్దులకు వచ్చాడు. తర్వాత తానే స్మగ్లింగ్‌కు కింగ్‌గా మారాడు. కూలీగా వెళ్లిన దానికంటే ప్రధాన స్మగ్లర్‌గా ఉంటేనే డబ్బు బాగా గిట్టుబాటు అవుతోందని భావించాడు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కారును గంజాయి స్మగ్లింగ్ కోసం కొన్నాడు. ఎంపీ 06 బీఏ 0710 నెంబరు కలిగిన ఈ కారును చిత్తూరు జిల్లాకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచే గంజాయి స్మగ్లింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గంజాయి కావాలని నాసిక్ నుంచి ఎవరైనా ఫోన్ చేస్తే బేరం మాట్లాడుకుంటాడు. అక్కడి నుంచి వచ్చిన మరొకరిని కార్లో తీసుకుని సరుకు కోసం మన్యానికి తీసుకెళ్తాడు. ఆ విధంగా చిత్తూరు జిల్లా పుంగూరుకు చెందిన ఫయాజ్‌ను తీసుకుని వస్తుండగా నగరంలోని ఎనికేపాడులో పటమట పోలీసులకు దొరికిపోయాడు. ఫయాజ్ స్వయంగా డ్రైవర్ కావడంతో కారును నడపడానికి అతడిని వెంటబెట్టుకుని వచ్చాడు. నర్సీపట్నంలో రూ.2.50 లక్షలకు 80 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నాసిక్‌కు బయల్దేరాడు. పక్కా సమాచారం రావడంతో పటమట పోలీసులు ఈ తరలింపును తొలిలోనే అడ్డుకున్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

సీకేదిన్నె, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆజాద్‌నగర్ సమీపంలో జింక మృతి చెందింది. కడప-రాయచోటి పులివెందుల బైపాస్‌లో రోడ్డు దాటుతున్న జింకను ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో చెర్లోపల్లె రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు సమాచారం అందించడంతో చింతకొమ్మదిన్నె పోలీసులు, ఫారెస్టు సిబ్బంది మృతి చెందిన జింకను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు విచారిస్తున్నట్లు తెలిపారు.

వాటర్‌గండిలో బాలుడి గల్లంతు

కడపక్రైం, ఏప్రిల్ 6: కడప నగర శివారులోని వాటర్‌గండిలో ఆదివారం ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఆ వివరాల్లోకి వెళితే.. కడప నగరం నకాశ్‌కు చెందిన సయ్యద్ సమీర్ (17) ఈత కోసం వాటర్‌గండిలో దిగాడు. ఈ క్రమంలో ఈత ఆడుతూ నీళ్లలో కొట్టుకుపోయాడని బంధువులు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం సామగ్రిని తరలించొద్దు

- ఏసీఏ నుంచి నిధులు మంజూరు చేసినా పూర్తి చేయని వైసీపీ
- ఇన్‌చార్జితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులను పూర్తి చేస్తాం
- టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి



సామగ్రిని తరలింపును పరిశీలిస్తున్న వెంకట్రామిరెడ్డి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నుంచి సామగ్రిని తరలించవద్దని టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్టేడియం వద్దకు వెళ్లి సామగ్రిని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏసీఏ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అయితే కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం, ఏసీఏ సంఘం మారడంతో స్టేడియం నిర్మాణ పనులు మరుగునపడ్డాయి. దీంతో ఇక్కడ ఉన్న సామగ్రిని తరలిస్తున్న విషయం తెలిసిన వెంటనే వెంకట్రామిరెడ్డి వాహనాన్ని అడ్డుకున్నారు. సమస్యను టీడీపీ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి, అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి సామగ్రిని తరలించవద్దని కోరారు. అనంతరం మీడియాతో మాట్లా డుతూ గత ప్రభుత్వం కేవలం కమీషన్ కోసమే పనులు ప్రారంభించింది తప్ప పూర్తి చేయలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందులలో స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం మంచిదే కానీ, 90 శాతం నిధులు మంజూరైనా పనులు మాత్రం 60శాతం అయ్యాయన్నారు. వీటిని తరలించవద్దని, క్రికెట్ స్టేడియం పూర్తి చేసి పులివెందులకు తలమానికంగా నిలబెడతామన్నారు. సమస్యను బీటెక్ రవితో కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

సీతారాముల కల్యాణం.. ఊరూరా సంబరం

"చూచు వారలకు చూడ ముచ్చటట .. పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట.. భక్తి యుక్తులకు ముక్తి ప్రదమట.." అన్నంత వైభవంగా శ్రీరామ నవమి సందర్భం గా ఆదివారం రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించారు. సుగంధ పుష్పాలు, విద్యుత్ దీపాల అలంకరణలో సుందరంగా తయారైన ఆ వేదిక పై చిద్విలాసం చిందిస్తూ శ్రీరాముడు, సిగ్గుల మొగ్గలా సీతమ్మ ఆసీనులయ్యారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు మేళతాళాలు, భక్తుల జైశ్రీరామ్ నినాదాల నడుమ వేదపండితులు మాంగళ్యధారణ చేయించారు. దంపతులుగా స్వామి, అమ్మవారు చిరునవ్వులు చిందిస్తూ భక్తులను అనుగ్రహించారు. కల్యాణోత్సవానికి హాజరైన జంటలకు అర్చకులు స్వామి, అమ్మ వారి తలంబ్రాలు, కంకణాలు కానుకగా అందించారు.

పీలేరు, పీలేరు రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం ప్రకాశం రోడ్డులోని కోదండరామ స్వామి ఆలయం, సదుం రోడ్డులోని కళ్యాణ సీతారామస్వామి దేవస్థానం, చిత్తూరు మార్గం బాపూజీ నగర్‌లోని రామాలయంలో ఆది వారం కల్యాణోత్సం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు 'శో భాయాత్ర' పేరిట స్కూటర్ ర్యాలీ నిర్వహిం చారు. కోదండ రామస్వామి, కల్యాణ సీతా రామస్వామి దేవస్థానాలను ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సందర్శించారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగ తం పలికి ఆశీర్వచనం అందజేశారు. నిర్మాణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి పునరుద్ధర ణకు ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. పీలేరు అర్బన్ సీఐ యు గంధర్, ఎస్ఐ బాలకృష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాల ధర్మకర్త లు నంద్యాల మణి, కోడి రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఎస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: మండలంలోని మండెంవారిపల్లి, బండమీద మాలపల్లి, అగ్రహారం, వెంకోజిగారిపలి, యర్రప్పగారిపల్లి తదితర గ్రామాలలో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వ హించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలో భక్తులు అక్కిం సురేష్, జయన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: సొంపల్లె పంచాయతీ బిళ్ళూరివారి పల్లెలోని విష్ణుసాయి రామాలయం, ములకల చెరువు లోని ఆంజనేయ స్వామి, పెద్దపాళ్యంలోని వీరాంజనేయ స్వామి, మద్దినాయనిపల్లెలోని రామాలయాల్లో సీతా రాముల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని కోదండ రామా లయంలో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. శేష సాయిబాబా ఆలయంలో వేద పండితులు స్కందమూర్తి శర్మ సీతారామ లక్ష్మణులకు పూజలు, పంచామృతాభి షేకాలు చేశారు. కోటకొండ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవా ల్లో డిప్యూటీ సీఎం ఓఎస్డీ జీఎస్ మధుసూదన్ కుటుంబ సమేతంగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కలకడ: మండలంలోని గంగాపురం, నడిమిచెర్ల, ఎర్ర కోటపల్లె, గుడిబండ గ్రామంలోని ఆలయాల్లో సీతారా ముల కల్యాణం నిర్వహించారు. ఊరేగింపు అనంతరం అన్నదానాలు చేశారు. నడిమిచెర్ల కోదండ రామాలయం లో కల్యాణోత్సవానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. గంగాపురం రామాలయంలో కల్యాణోత్సవ ఉభయదారులుగా దగ్గుబాటి వెంకటేశ్వర రావు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

గుర్రంకొండ: గుర్రంకొండ, తరిగొండ, చెర్లోపల్లె, అరిగెల వారి పల్లె, రామాపురం గ్రామాల్లో సీతారాముల కల్యాణో త్సవాన్ని నిర్వహించి ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు

రామసముద్రం: మండలంలోని తిరుమలరెడ్డిపల్లె, రామసముద్రం, ఆర్.నడింపల్లె, జంగాలపల్లె, చెంబకూరు, కేసీపల్లె, మినికి, వనగానిపల్లె, కనగాని, ఊల పాడు, గుంతలపేట గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆర్.నడింపల్లె లోని రామాలయంలో జడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి, ఉమా దేవి, గ్రామసు లు ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణులకు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

కలికిరి: పట్టణంలోని రాముల వారిగుడి వీధి, క్రాస్ రోడ్డులోని రాములవారి ఆలయాల్లో కల్యా ణోత్సవాల అనంతరం గ్రామంలో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. చాందినీ బండ్లలో గ్రామోత్సవాలు నిర్వ హించా రు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నదానాలు ఏర్పా టు చేశారు.

కురబలకోట : మండలంలోని అంగళ్లు, కురబలకోట, పిచ్చల వాండ్లపల్లె, కమతంపల్లె, మొలకవారిపల్లెల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు.

బి.కొత్తకోట : మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి, సీఐ జీవన్ గంగానాథ్‌బాబు ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.


పీలేరు: కోదండరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


బీ కొత్తకోటలో ప్రత్యేక అలంకరణలో సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు


కోదండరామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


పీలేరు: శోభాయాత్రలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

రాములవారి ఆలయాలకు విరాళం

కలికిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా కలికిరి పంచాయతీలోని రాములవారి ఆలయాల్లో వైభవంగా వేడుకలు నిర్వహించేందుకు పెద్ద మొత్తంలో వితరణలు చేశారు. పంచాయతీలోని అండేకురవపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు సిబ్బాల దినకర్ ఇందిరమ్మకాలనీ, బండకాడ దళితవాడ, తుమ్మలపేట వడ్డెపల్లెలోని మూడు ఆలయాలకు ఒక్కోదానికి రూ.10 వేల వంతున వితరణ చేశారు. ఆయా ఆలయాల నిర్వాకులకు ఆదివారం నగదు అందజేశారు. పండుగల సందర్భంగా వితరణల రూపంలో ఆయన ఆధ్యాత్మికంపై తనకున్న ఆసక్తిని చాటుకుంటున్నారు.

పెద్దమండ్యం పెద్దమడ్యంతో పాటు మందలవారిపల్లి, బండమీదపల్లి, కోటగుట్టపల్లి, వెలిగల్లు, బండ్రేవు తదితర గ్రామాల్లో సీతారామకల్యాణం, ఊరేగింపులు నిర్వహించారు

పెద్దతిప్పసముద్రం: రంగసముద్రం పంచాయతీ వినసకర్రవాండ్లపల్లెలో సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి కల్యాణోత్సవం నిర్వహించారు.


గుర్రంకొండ: సీతారాముల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కలికిరిలో రాములవారి ఆలయానికి నగదు అందజేస్తున్న సిబ్బాల దినకర్


రామసముద్రం: నడింపల్లెలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు


బి.కొత్తకోట బెంగళూరు రోడ్డులో పానకం, ప్రసాదం పంపిణీ చేస్తున్న యువకులు


కలకడ: గంగాపురంలో సీతారాముల కల్యాణోత్సవం ..

సమస్యలు పరిష్కరించాలని వినతి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి): సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ పలువురు ఓఎస్డీ మధుసూదన్‌కు వినతి పత్రాలు అందచేశారు. ఆదివారం డిప్యూటీ సీఎం ఓఎస్డీ, విజయవాడ ఆర్డీవో మధుసూదన్ కుటుంబ సమేతంగా కోటకొండ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు హాజరయ్యారు. గట్టు కస్పాలో హిందూ శ్మశానవాటికకు కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలని, కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమికి పట్టా మంజూరు చేయాలని అదే గ్రామానికి చెందిన అమర్‌నాథ్, రెడ్డప్ప, కోటకొండ గ్రామంలో అభివృద్ధి పనులపై గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ.. తన దృష్టికి వచ్చిన సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


ఓఎస్డీ మధుసూదన్‌కు వినతిపత్రం అందచేస్తున్న గ్రామస్థులు

మంత్రిని కలిసిన పీలేరు జనసేన నేత

పీలేరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చిన రాష్ట్ర మంత్రి, జనసేన నేత నాదెండ్ల మనోహర్ ను ఆదివారం పీలేరుకు చెందిన జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్య దర్శి కలప రవి మర్యాదపూర్వకంగా కలిశారు. పీలేరు నియోజకవర్గం లో జనసేన పార్టీ స్థితిగతులపై మంత్రి ఆరా తీశారని తెలిపారు. మంత్రి ని ఆయన శాలువతో సన్మానించారు.


మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలప రవి

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయం లో ఆదివారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో అలంకరించారు. సంతానం లేని దంపతులు ఆలయంలో ఆకుపసరు తాగి తడిబట్టలతో వరపడ్డారు. మొక్కులు తీర్చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీసీ రోడ్లు ప్రారంభించనున్న నల్లారి

కలికిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలను సోమవారం సాయంకాలం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభించ నున్నట్లు సర్పంచు యల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. పంచాయతీలోని టీబీ రోడ్డు, యల్లమ్మ ఆలయం వెనుక వైపు, అండే కురవపల్లె, సత్యాపురం, మంగమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్లను, డ్రైనేజీ కాలువలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సొసైటీ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సాయిలోకేశ్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేత మాట్లాడుతూ ప్రధాని మోడీ 11 ఏళ్లగా భారతప్రధానిగా కొనసాగుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై భారతీయ జనతా పార్టీ జండాను ఎగరవేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, బర్నేపల్లె రవికుమార్, పిల్లస్వామి నాయక్, కృష్ణయ్య వర్మ, పూల నాగరాజు, ఆనంద్ రాజశేఖర్‌రెడ్డి భగవాన్, కోసూరి భగవాన్, మండల అధ్యక్షులు నాగరాజ, కిరణ్, రామిరెడ్డిగారిపల్లె వెంకటరమణారెడ్డి,గిరిజన మోర్చా స్టేట్ రీసర్స్ కో కన్వీనర్ పి, బోజ్జప్ప, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె క్రాస్ మూడు రోడ్ల కూడలిలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. బీజేపి కార్యకర్తలకు, ప్రజలకు స్వీట్లు పంచిపెట్టి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ..భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడం, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడం బీజేపీ లక్ష్యమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, అసెంబ్లీ కోకన్వీనర్ శంకర్‌రెడ్డి, హరినాథరెడ్డి, పీర్ల మాబు తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: మండలంలోని వేపూరికోట, దేవళచెరువు గ్రామాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, నాయకులు బయారెడ్డి, మునీంద్ర, నారాయణ, రమణ, రామచంద్రారెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

గుర్రంకొండ: బస్టాండులో బీజేపీ జెండాను ఎగురవేశారు. నాయకులు రామాంజులు, శ్రీనివాసులు, రామూర్తి, శ్రీన, అమర, మల్లి, రామంజులరెడ్డిలు పాల్గొన్నారు.

కలకడ: బీజేపీ పీలేరు కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బస్టాండు కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులరెడ్డి, ఆంజినేయులనాయుడు, శ్రీధర్, మల్లికార్జున, శేఖర్‌లు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో ఆదివారం భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ వేడుకలను ఎంతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గాంధీబస్టాండ్ వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ జాతీయ స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పి.నరేంద్ర కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడు గోవిందురాజులు, జనరల్ సెక్రటరీ విష్ణుచైతన్య నాయకులు ఖాదరి, వీరంరెడ్డి, గౌతమ్ పాల్గొన్నారు.

రామసముద్రం : మండల కేంద్రంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఇంజం ఆనంద్, కృష్ణమూర్తి బీజేపీ జెండా ఆవిష్కరించారు. నాయకులు భాస్కర్, వెంకటేష్‌రెడ్డి, శ్రీనివాసులు, జనార్దన్, వీరకుమార్‌నాయుడు, రామన్న, గుంతలపేట చలపతి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నవీన్, సుబ్రమ్మణ్యం, ఊటు గొల్లపల్లె రెడ్డి పాల్గొన్నారు.


కురబలకోట : బీజేపీ కిసాన్‌మోర్చా అధికార ప్రతినిధి చల్లపల్లె నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాయిలోకేశ్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఆటో రాజారెడ్డి, రజాక్, బావాజీ, శంకర్‌రెడ్డి, విశ్వనాథ పాల్గొన్నారు.


బి.కొత్తకోట: స్థానిక జ్యోతిసర్కిల్ లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. తాకాటంవారిపల్లెలో పార్టీ మాజీ అధ్యక్షుడు రాందాసు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. నాయకులు కావడి రవీంద్ర, గోరంట్లరమేష్, ముకుంద, మురళి, రంగారెడ్డి, రవి.కార్తీక్, నాగరాజు, షౌకత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దతిప్పసముద్రం : స్థానిక బస్టాండులో బీజేపీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువరు బిజెపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, మల్లెం శివయ్య, కార్యం శంకర, బాస్కర్‌రెడ్డి, సుబ్బమ్మ, శివారెడ్డి, పులికల్లు మబ్బు రమణ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: బీజేపీని బలోపేతం చేయాలని పెద్దమండ్యం మండల బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకొని పెద్దమండ్యం లో ఆదివారం ఆ పార్టీ జండాను ఆవిష్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో పార్టీ జండాను కార్యకర్త మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తున్నదని తెలిపారు. కార్యకర్తలు పార్టీంటకి అండగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిమ్మనాగేశ్వర, ప్రభాకరరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించిన నాయకులు


వాల్మీకిపురంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


తంబళ్లపల్లెలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆ పార్టీ నాయకులు


ములకలచెరువు: జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేత గోపాల్‌రెడ్డి

జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జునైద్ అక్బరీ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రైమ్ స్పోర్ట్స్ అరినాలో షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జునైద్ అక్బరీని రాయలసీమ జిల్లాల షూటింగ్‌బాల్ కన్వీనర్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆ అసోసియేషన్ కార్యదర్శి గౌతమి, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా షూటింగ్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన బాలుర జట్టులో చరణ్, షణ్ముఖ్, సాయి, గణేష్, పరమేశ్, హమీద్, గౌస్ అహ్మద్, అజహరుద్దీన్, మౌనిష్, రిత్విక్, యోగేంద్ర, సంజయ్, బాలికల జట్టులో అనూష, శారద, నేహా, సంధ్య, ప్రణీత, సుమిత్ర, నవ్య, లాస్య, శశికళ, కరీమున్నీసా, అమూల్య, మమత ఉనారు. ఎంపికైన కీడాకారులను నూతన జిల్లా అధ్యక్షుడు జునైద్ అక్బరీ అభినందించారు.

కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల కన్వీనర్ నరేష్‌బాబు, జిల్లా కార్యదర్శి మురళి, అంతర్జాతీయ షూటింగ్‌బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్‌బాష, కోచ్‌లు మురళి, ఉదయ్, పీడీలు బాష, శివశంకర్, సీనియర్ క్రీడాకారులు కుమార్‌నాయక్, చరణ్‌రెడ్డి, ఫైజల్, తదితరులు పాల్గొన్నారు.


జునైద్ అక్బరీని సన్మానిస్తున్న షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు

బాలిక ఆత్మహత్య


ములకలచెరువు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళచెరువులో ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...గ్రామానికి చెందిన రాజేంద్ర ప్రసాద్ కుమార్తె మహిమ(17) తొమ్మిదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇష్టంలేని పెళ్ళి చేసేందుకు కుటుంబీకులు ప్రయత్నిస్తుండడంతో బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అడవి పంది దాడిలో మహిళకు గాయాలు


అడవి పంది దాడిలో గాయపడిన మహిళ

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి): అడవి పంది దాడి చేయడంతో ఓ మహిళ గాయపడింది. బాధితురాలి కథనం మేరకు.. మదనపల్లె మండలం టేకుల పాలెంకు చెందిన గోపాల్ భార్య సుభద్రమ్మ(40) ఆదివారం పొలం పనులు చేసుకొంటుండగా అడవి పంది దాడి చేసింది. దీంతో గాయపడిన మహిళను కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి వైద్యం అందించారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు


తేనెటీగల దాడిలో గాయపడిన బాలుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో ముగురు విద్యార్థులు గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు మదనపల్లె పట్టణం, గౌసియా వీధికి చెందిన మౌలాలి కుమారుడు అహ్మద్ గౌస్ (17) ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. వేసవి సెలవుల కారణంగా ఆదివారం తన మిత్రులతో కలిసి స్థానిక బీటీ కళాశాల గ్రౌండ్‌లో ఆడుకుంటుండగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ముగ్గురు పిల్లలు గాయపడారు. అహ్మద్‌గౌస్‌ను మాత్రం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.